దారి.. ప్రమాదకరంగా మారి..

- నగరంలో ప్రధాన రహదారులపై ఇసుక రాశులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు


శ్రీశ్రీ సర్కిల్ వద్ద బైపాస్ రోడ్డుపైకి చేరిన ఇసుక

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో రోడ్లు బాగున్నాయని.. రయ్‌రయ్‌మని దూసుకెళ్లొచ్చని భావించే వాహనదారులకు ఇసుక కుప్పలు అడ్డుకట్ట వేస్తున్నాయి. ప్రధాన రహదారులపై ఇసుక డంప్ చేయడం.. నిర్మాణ వ్యర్థాలు ఎక్కడికక్కడే వదిలేస్తుండటంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. నగరంలో పలుచోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తున్నా కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఎక్కడ ఏం జరుగుతోందోనని వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

ప్రమాదకరంగా బైపాస్‌రోడ్డు..

వరంగల్ – భద్రాచలం ప్రధాన రహదారి ఖమ్మం నగరం మీదుగా వెళ్తుంది. ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి నుంచి ఈ రహదారి ప్రారంభమై శ్రీశ్రీ సర్కిల్ వరకు ఉంటుంది. నిత్యం వేల సంఖ్యలో భారీ వాహనాలతో పాటు బస్సులు, కార్లు, తదితర వాహనాలు వెళ్తుండగా.. ఈ రహదారిని శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉంది. కానీ పలు ప్రాంతాల్లో ఇసుక లారీలు, ట్రాక్టర్లు ఆపి ఇతర వాహనాల్లోకి మార్చడం, రోడ్డు వెంట భవనాలు, ఇతర నిర్మాణాలు చేపట్టే వారు వ్యర్థాలు వదిలేస్తుండడంతో రోడ్డుపైకి చేరగా.. రాపర్తినగర్ బోర్డు నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. తరచుగా ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. ఇలాంటి ఘటనల్లో గాయాల పాలైన వారు అనేక మంది ఉన్నారు.

అంతర్గత రోడ్లపైనా..

నగరంలోని బైపాస్ రోడ్డుతో పాటు అంతర్గత రోడ్లు సైతం అధ్వానంగా కనిపిస్తున్నాయి. భవనాలు, ఇతర నిర్మాణాల కోసం తీసుకొస్తున్న ఇసుక, కంకర రోడ్డుపైకి చేరుతున్నాయి. కొన్నిచోట్ల అయితే ఇసుక, కంకర రోడ్లపైనే పోస్తున్నారు. అయినా కేఎంసీ సిబ్బంది నిర్లిప్తత.. యజమానుల అలసత్వంతో నగరంలో పలు ప్రాంతాల్లో రోడ్లపై వాహనాలు నడపలేని పరిస్థితి ఉంది.

రోడ్లను శుభ్రం చేయరా?

ఖమ్మంలోని అన్ని ప్రధాన రహదారుల వెంట మట్టి, చెత్తాచెదారం ఉండకుండా నిత్యం శుభ్రం చేయిస్తుంటారు. ఈ బాధ్యతను కేఎంసీ అధికారులు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించారు. స్వచ్ఛభారత్ మిషన్ పథకం కింద కేఎంసీ నుంచి నిధులు కేటాయిస్తున్నారు. నగరంలో 54 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన రహదారులకు ఇరువైపులా ప్రతిరోజూ శుభ్రం చేసినందుకు ఏజెన్సీకి నెలనెలా రూ.13 లక్షలను చెల్లిస్తున్నారు. అయితే, ఏజెన్సీ నిర్వాహకులు తూతూమంత్రంగా రోడ్లను శుభ్రం చేయిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. దీంతో రోడ్లపై ఇసుక, కంకర, ఇతర నిర్మాణ వ్యర్థాలు రోడ్లపైనే ఉంటుండగా, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

వాహనం నడపాలంటే భయం వేస్తోంది..



నగరంలోని బైపాస్‌రోడ్డుపై చాలాచోట్ల ఇసుక చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో రోడ్డుపై వాహనం నడపాలంటే భయమేస్తోంది. ద్విచక్ర వాహనాలు తరచూ ఇసుక కారణంగా జారి పడుతున్నాయి. భారీ వాహనాలు వచ్చిన సమయాన దిచక్రవాహనం రోడ్డు పక్కకు దించాలని చూస్తే పడతామేమోనని భయమేస్తోంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

–డి.సూర్యతేజ, వాహనదారుడు

ప్రతి రోజూ రోడ్లను శుభ్రం చేయాలి..



నగరంలోని ప్రధాన రహదారులు ఇసుక, కంకర తదితర వ్యర్థాలతో కనిపిస్తున్నాయి. వీటి కారణంగా వాహనాలను నడపలేని పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై ఇసుక, కంకర వంటివి లేకుండా ప్రతిరోజూ శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి.

–వి.వెంకటేశ్వర్లు, నగరవాసి

క్లుప్తంగా

శ్రీరక్ష ఆస్పత్రిలో 'షిప్' కార్యక్రమం


రెహ్మాన్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని శ్రీరక్ష ఆస్పత్రిలో శ్రీరక్ష హెల్త్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (షిప్)ను శాంతి సందేశం సంస్థ అధ్యక్షుడు శిరాజుల్ రెహ్మాన్.. యజమాని గొంగూర వెంకటేశ్వర్లు (జీవీ)తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షిప్ కార్యక్రమం మూడు నెలల పాటు ఉంటుందన్నారు. అనంతరం శిరాజుల్ రెహ్మాన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు ఏడుకొండలు, సతీశ్, మానస, వెంకటేశ్, సుదీందర్‌రెడ్డి, అల్తాఫ్, వేణు, రవితేజ, అడ్వకేటు తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాలేరు ప్రజలు కాంగ్రెస్ వైపే..


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: పలుమార్లు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన పాలేరు ప్రజలు వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థినే గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని దమ్మాయిగూడెంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని విస్మరించి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిందని గుర్తు చేశారు. మళ్లీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, దంపతులకు పెన్షన్లు, ఇళ్లు ఇస్తామని తెలిపారు. అనంతరం మండలంలోని చంద్రుతండాలో హాథ్‌సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. నాయకులు ఉన్నం రాజశేఖర్, పాప్యానాయక్, బాలాజీ, నంద్యాల శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్, పత్తి నాగేశ్వరరావు, మోహన్, ఆశీర్వాదం, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదల సంక్షేమం

రఘునాథపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదల సంక్షేమంతో పాటు రైతులకు మేలు జరిగిందని పార్టీ రఘునాథపాలెం మండల కన్వీనర్ భూక్యా బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని దొనబండలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలోనే కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని పేర్కొన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతరం గ్రామ అధ్యక్షుడిగా తేజావత్ నవీన్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్తి కృష్ణ, మారుతి రామారావు, ధరావత్ రమేశ్, బోడ రాంబాబు, చలమల రామారావు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మధుకాన్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎంపీ

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం వద్ద ఉన్న మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండ్రస్టీస్‌ను ఆదివారం మధుకాన్ సంస్థల చైర్మన్, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సందర్శించారు. నేలకొండపల్లిలో జరుగుతున్న ఆత్మీయ సమ్మేళనానికి వెళ్తున్న ఆయన ఫ్యాక్టరీకి వచ్చారు. ఇక్కడి అధికారులతో పలు అంశాలపై చర్చించగా.. రాజేశ్వరపురం సర్పంచ్ దండా పుల్లయ్య, నాయకులు ఎర్రబోయిన నర్సయ్య, షేక్ సోందుమియా, సత్యనారాయణరెడ్డి ఆయన్ను కలిశారు.

ఒకటో తేదీనే వేతనాలివ్వాలి

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతీ నెల 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే, గత ఆర్థిక సంవత్సరం పెండింగ్‌లో ఉన్న బిల్లులు సైతం విడుదల చేయాలని వారు పేర్కొన్నారు.

రాజేశ్వరరావు ఆదర్శప్రాయుడు..

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనిస్టు యోధుడు చండ్ర రాజేశ్వరరావు సీపీఐ జాతీయ కార్యదర్శిగా అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించడమే కాక కులమతాలకు వ్యతిరేకంగా పనిచేసి అందరికీ ఆదర్శంగా నిలిచారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం అన్నారు. ఖమ్మం లెనిన్‌నగర్‌లో రాజేశ్వరరావు వర్థంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. సీపీఐ నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఎస్కే సైదా, చానా, ఎండీ రెహమాన్, డాక్టర్ ఖాసీం, బాషా, దుర్గానాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


ఖమ్మంమయూరిసెంటర్: దిష్టిబొమ్మను దహనం వైఎస్సార్‌టీపీ నాయకులు


నేలకొండపల్లి: దిష్టిబొమ్మ దహనంను చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి: నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం, నేలకొండపల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుంపాల కృష్ణమోహన్, మర్రి శ్రీనివాస్, పత్తిపాటి అప్పారావు, రావుల గంగరాజు, కందిమల్ల హరీశ్, సగుర్తి సుధాకర్, గడ్డం కృష్ణ, జానకీరాములు, అరుణ, లావణ్య, నంద్యాల రవీందర్‌రెడ్డి, నీలం రమేశ్, కొత్త బాలాజీరావు, పసుపులేటి సైదులు, గుగులోత్ రూప్లానాయక్, సత్యనారాయణ, వైవీ రెడ్డి, ఉపేందర్, అన్నబత్తుల కృష్ణ, యాలాద్రి, చిట్యాల సైదాబాబు, ఆలేటి రాములు, పి.నరసింహారావు, చారి, శ్రీను, రమేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

పోటాపోటీగా నామినేషన్లు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం పట్టణ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పదవులకు ఆదివారం పోటాపోటాగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల అధికారి కొత్త వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నామినేషన్ల గడువు ముగిసే సమయానికి మొత్తం 15 పదవులకు 38 నామినేషన్లు దాఖలయ్యాయి. 485 మంది సభ్యులున్న ఈ సంఘం పదవీ కాలం మూడేళ్లు ఉంటుంది. 2023 నుంచి 2026 కాలానికి ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నాయి. లారీ యజమానుల సంఘం పదవులకు అభ్యర్థులు రెండు ప్యానెళ్లుగా నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష పదవికి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు ప్రధాన కార్యదర్శి పదవికి కూడా అదే నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయటం గమనార్హం. బోజడ్ల పూర్ణచందర్‌రావు, బోయపాటి శ్రీనివాసరావు(వాసు), డి.భద్రం, సముద్రాల శ్రీనివాసరావు అధ్యక్ష, కార్యదర్శ పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి మండా రఘురామప్రసాద్, సుధగాని ఉపేందర్, సంయుక్త కార్యదర్శి పదవికి ఎస్కే నాగుల్‌మీరా, ఎస్కే రంజాన్, కోశాధికారి పదవికి ఆవుల ఉమామహేశ్వరరావు(మహేశ్), నరాల అశోక్ కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. 10 కార్యవర్గ సభ్యుల పదవులకు 24 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం నామినేషన్ల ఉపసహారణ అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవులకు బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరనేది స్పష్టమవుతుంది. 16వ తేదీన ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలను ప్రకటించనున్నారు.

12 రకాల సరుకులు అందించాల్సిందే..


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

రఘునాథపాలెం: రేషన్ షాపుల ద్వారా ప్రజలకు 12 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని పీఓడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా సరుకులు ఇవ్వడంతో పాటు అర్హులందరికీ కార్డులు మంజూరు చేయాలనే డిమాండ్‌తో చేపట్టనున్న ఉద్యమాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మండలంలోని వేపకుంట్లలో ఆదివారం ఆవిష్కరించాక పీఓడబ్ల్యూ మండల కార్యదర్శి బానోత్ పద్మ మాట్లాడారు. గ్యాస్ ధరలు కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు కంటేపూడి చంటి, పొట్లపల్లి నాగమణి, పాలె నాగరత్నం, సంతోషం, శ్రీకాంత్, మురళి, విజయ్, సునీల్, నేలాల తులసమ్మ, శిరోమణి, సీతమ్మ, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ మెడికల్ అకాడమీ ప్రోమో ఆవిష్కరణ


ప్రోమో ఆవిష్కరిస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన డైరెక్టర్లు సతీశ్, భరణికుమార్

ఖమ్మంసహకారనగర్: డాక్టర్స్ మెడికల్ అకాడమీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రోమో (వీడియో సాంగ్), మెమెంటోను రాష్ట్ర రవాణాశాఖామంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అజయ్‌కుమార్ మాట్లాడారు.. వైద్యులపై ప్రోమో, మెమెంటోను రూపొందించడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్లు రాయల సతీశ్‌బాబు, ఈగా భరణికుమార్ మాట్లాడారు.

నేడు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహిస్తున్న నిరసనను జయప్రదం చేయాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జీపీఏ) బాధ్యులు కోరారు. నెలనెలా ఒకటో తేదీన పింఛన్ చెల్లింపు, బకాయి డీఏ విడుదల, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు తదితర డిమాండ్లతో ఈ నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్లు పెద్దసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వైస్ చైర్మన్‌కు సన్మానం


సయ్యద్ బాషాను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో కమిటీని నియమించగా వైస్‌చైర్మన్‌గా తెలంగాణ నూర్‌బాషా, దూదేకుల ముస్లిం, మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాషాకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆయనను ఆదివారం ఖమ్మంలో పలువురు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ లాల్ జాన్‌బాషాతో పాటు సోందు, షేక్ షకీనా, షేక్ రహీంపాషా, షేక్ ఫరీద్, షేక్ సాహెబ్ హుస్సేన్, షేక్ సైదులు, అలీ, సుభాన్ పాల్గొన్నారు.

రోడ్డు పక్కన గుడిసెల తొలగింపు


జలగంనగర్ వద్ద కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్ నుంచి పెదతండా, వరంగల్ క్రాస్, కోదాడ క్రాస్, మద్దులపల్లి వరకు ఖమ్మం – సూర్యాపేట రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలు, గుడిసెలను ఆదివారం తొలగించారు. పోలీసు బందోబస్తు నడుమ ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది చేరుకుని గుడిసెలు, కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా చిరువ్యాపారాలు చేసుకుంటూ తమను ఖాళీ చేయించొద్దని పలువురు కోరగా, ప్రభుత్వ అనుమతితోనే కట్టడాలు తొలగిస్తున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఏసీపీ బస్వారెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి స్నేహితుల ఆర్థిక సాయం

తిరుమలాయపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న వ్యక్తికి ఆయన స్నేహితులు అండగా నిలిచారు. రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన ఎల్.ప్రవీణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. సమాచారం తెలుసుకున్న స్నేహితులు అతడికి నగదు అందించారు.

ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

ఖమ్మంసహకారనగర్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు వేగినాటి ఉదయ్‌కుమార్.. వృద్ధులు, యాచకులకు అన్నదానం చేశారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు మోహన్, నవీన్‌కుమార్, సోహెల్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ఆర్‌సీఎం చర్చిలో వాక్యోపదేశం చేస్తున్న మతపెద్దలు


కామేపల్లి(కారేపల్లి): కొత్తలింగాల చర్చిలో ప్రార్థన నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఖమ్మంగాంధీచౌక్: ఏసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి వచ్చిన (పునరుత్థానం) రోజుగా భావిస్తూ ఆదివారం జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను జరుపుకున్నారు. చర్చిలు, ప్రార్థనా మందిరాలకు శనివారం అర్ధరాత్రి నుంచి క్రైస్తవులు చేరుకొని ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఆర్‌సీఎం, సీఎస్ఐ, గుడ్ షెఫర్డ్ తదితర చర్చిల్లో ఈస్టర్ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు మరణాన్ని జయించాడని, సమాధి ఆయనను శాశ్వతంగా బంధించలేక పోయిందని, క్రీస్తు తిరిగి లేచాడని వాక్యోపదేశాలు చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి బైబిల్‌ను చేతబూని సకుటుంబంగా చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్కెస్ట్రా, వాయిద్యాలతో గీతాలాపనలు చేయడంతో చర్చిలు మారుమోగాయి.

కామేపల్లి మండలంలో..

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం కొత్తలింగాల విచారణ పరిధిలోని ముచ్చర్ల, జాస్తిపల్లి, సాతానిగూడెం, తాళ్లగూడెం, పింజరమడుగు, గోవింద్రాల, నెమలిపురి, పండితాపురం తదితర గ్రామాల్లో పీఎస్ మారియో ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కొత్తలింగాలలోని బాలయేసు చర్చిలో అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో టి.జమలమ్మ, సురేశ్, గాజుల ముత్తమ్మ, గుండ్ల రమేశ్, గాజుల కుమారి, వై.నిర్మల, గుండ్ల ప్రశాంతి, హెచ్చు రాంబాబు, విజయమ్మ, రేణుక, నాగమణి, సులోచన, టి.సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పొంగులేటి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పండితాపురంలో ఇటీవల జరిగిన రాళ్లదాడిలో గాయపడిన మొగిలి శ్రీను, బండి లక్ష్మి, నర్సు కుటుంబాలతోపాటు పండితాపురం, కెప్టెన్ బంజరల్లో అనారోగ్యంతో బాధపడుతున్న, మరణించిన పలువురి కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అలాగే, కొబ్బరిచెట్టు తండాలో ఆంజనేయ స్వామి, కెప్టెన్ బంజరలో మసీద్, గోవింద్రాలలోని అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం అందజేశారు. కార్యక్రమాల్లో భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్‌తో పాటు షేక్ ఫతేమహ్మద్, మేకల మల్లికార్జున్‌రావు, బానోతు నర్సింహ, ధరావత్ లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన సీపీఐ, సీపీఎం నాయకులు

కూసుమంచి: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐక్య వేదిక సమావేశానికి మండలానికి చెందిన ఆయా పార్టీల నాయకులు తరలివెళ్లారు. సీపీఎం మండల కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు గుండెపొంగు మల్లేశ్, మండల కార్యదర్శి నర్సింహ హైదరాబాద్ వెళ్లిన వారిలో ఉన్నారు.

సీపీఐ నాయకులపై కేసు

నేలకొండపల్లి: మండలంలోని పలువురు సీపీఐ నాయకులపై కేసు నమోదైంది. మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన రైతులు దారి కోసం ఈ నెల 6న నేలకొండపల్లిలో రహదారిని దిగ్బంధించారు. ఈ కార్యక్రమానికి అనుమతి లేకపోగా, గంటల తరబడి వాహనదారులు ఇబ్బంది పడినందున పోలీసులు ఆదివారం సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు కర్నాటి భానుప్రసాద్, మారిశెట్టి వెంకటేశ్వరరావుతో పాటు చిర్రా ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రకృతి వనమేనా ?



నగరం పచ్చదనంగా ఉండేలా కేఎంసీ ఆధ్వర్యాన పలు డివిజన్లలో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి వందల సంఖ్యలో మొక్కలు నాటారు. కొన్ని వనాల్లో బోర్లు, మోటార్లు ఏర్పాటు చేసి మొక్కలకు నీళ్లు పెడుతుండగా.. మరికొన్నింటిని పట్టించుకునేవారే కరువయ్యారు. నగరంలోని 49వ డివిజన్‌లో రైల్వే ట్రాక్ పక్కన గోడకు ఆనుకొని ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనంలో మొక్కలకు నీళ్లు పోసే వారు లేక ఎండిపోతున్నాయి. దీనికి తోడు సమీప గృహస్తులు నిర్మాణ వ్యర్థాలను ఇక్కడే పోస్తుండడంతో డంపింగ్ యార్డులా మారింది.

–ఖమ్మంమయూరిసెంటర్:

ప్రశ్నించాల్సిన అధికారి : వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.. సెల్ నంబర్ : 91772 36224

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం
సాయిరాం	మీటర్
ఆదిత్య	రావణాసుర
శ్రీనివాస	రావణాసుర
సుందర్	దిపోప్స్ ఎక్సోర్సిస్ట్

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	38		10
కాకర	46	చుక్కకూర	2
బోడ కాకర	80		10
బీర	50	తోటకూర	2
దొండ	20		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	60		10
గోరుచిక్కుడు	48	మెంతికూర	5
క్యాబేజీ	16		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	26		15
బీన్స్	46	-ఖమ్మం వ్యవసాయం	